www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 సెప్టెంబర్ 2025
5
అన్నమయ్య



గర్భిణులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-పీలేరు

ఆరోగ్యకర సంతానం కోసం గర్భిణులు పౌష్టిక ఆహారం తీసుకోవడం, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరమని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. సోమవారం పీలేరు మండలం, తలుపుల పిహెచ్‌సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు డాక్టర్ చంద్రశేఖర్ ఆరోగ్య సేవలు, సూచనలు తెలియజేశారు. రక్త, మూత్ర పరీక్షల సహకారంతో హిమోగ్లోబిన్, అల్బుమిన్, అధిక రక్త పోటు, మధుమేహం మొదలగు ఆరోగ్య సమస్యల నిర్ధారించి తగినన్ని మాంసకృతులు, ఉతకూరలు, కాల్షియం, విటమిన్లు, కొవ్వు పదార్థాలు తీసుకోవాలన్నారు. కడుపు నొప్పి, ఆయాసం, నీరసం, కాళ్ళవాపు, జ్వరం, లక్షణాలు ఉన్నట్లయితే ప్రమాదకరంగా భావించి తక్షణమే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత చికిత్స సలహాలు పొందాలని చెప్పారు. అనంతరం డాక్టర్ చంద్రశేఖర్ సహకారంతో 26 మంది గర్భిణులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, ఎఎన్ఎం ఫామున్నీసా, నాగవేణి, ప్రమీల, సిహెచ్ఒ కుమద, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.



వృ.కా.స జెండాను ఆవిష్కరిస్తున్న జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్



అమరులకు నివాళులర్పిస్తూ మౌనం పాటిస్తున్న జాతీయ నాయకులు

కడపలో మూడ్రోజులపాటు నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండవ రోజైన మంగళవారం హరిత హోటల్ ప్రాంగణంలో వ్యవసాయ కార్మిక సంఘం జెండాను జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్ ఆవిష్కరించారు. అనంతరం సెమినార్ హాలులో సిపిఎం అగ్రనేతలు పుచ్చలపల్లి సుందరయ్య, వి.ఎస్.అచ్యుతానందన్, సీతారాం ఏచూరి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం దేశంలో అమరులైన ప్రజా సంఘాల నాయకులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, మహిళా వ్యవసాయ కార్మిక సంఘం కన్వీనర్ లలితాబాలన్, కేరళ వ్యవసాయ కార్మిక సంఘం సంక్షేమ సంఘం బోర్డ్ చైర్మన్ చంద్రన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాలసుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, మహిళా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ శివ నాగరాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామనూరు శ్రీనివాసులరెడ్డి, మనోహర్, సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్, ఇతర డెలిగేట్ సభ్యులు, స్థానిక నాయకులు డి.దస్తగిరిరెడ్డి, శివకుమార్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రధాన వార్త మెయిన్‌లో

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



టమోటా పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-ములకలచెరువు

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని సోంపల్లిలో నానో ఎరువులు, జీవన ఎరువులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులకు యూరియా కొరత లేకుండా సమృద్ధిగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రైతుల అవసరానికి మించి 4 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. అదనంగా వెయ్యి మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నదని, అవసరమైతే మరిన్ని టన్నులు యూరియాను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా పేర్కొన్నారు. యూరియా అధికంగా ఉపయోగించడం వల్ల భూమి సారాన్ని దెబ్బతీసి భవిష్యత్తు తరాలకు నష్టాన్ని కలుగజేస్తుందని హెచ్చరించారు. కంది పంటలకు యూరియా అవసరం లేదని, ప్రతి పంటకు అవసరమైనంత మేరకే వాడాలని సూచించారు. ప్రయివేట్ షాపుల్లో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే ఫిర్యాదులు చేయాలని తెలిపారు. రైతులు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని చెప్పారు. ఎవరైనా అధిక రేటుకు కొనుగోలు చేసినట్లు సాక్ష్యాలు ఉంటే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫిర్యాదులకు 08561293006 నంబర్‌ను అందుబాటులో ఉంచామన్నారు. రైతుల పేర్లు గోప్యంగా ఉంచుతామని, దుకాణాల లైసెన్సులు రద్దు చేసే వరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు సేవా కేంద్రాల్లో సరసమైన ధరకు ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి ఎకరానికి అవసరమైనంత యూరియా జిల్లాలో లభ్యమ వుతోంది. రైతులు అధిక వినియోగం చేయవద్దని, సహజ పద్ధతులు, నానో యూరియా వినియోగం ద్వారా నేల సారం కాపాడుకోవాలని రైతులకు సూచించారు. మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మాట్లాడుతూ రసాయన ఎరువులు, యూరియా ఎక్కువగా వాడడం వల్ల పంట ఎక్కువగా వస్తుందనేది అపోహ మాత్రమేనని ఇది శాస్త్రీయంగా కూడా నిజమని తేలిందని పేర్కొన్నారు. యూరియా వినియోగం అనేది పంటకి ఎంత అవసరమో అంత మాత్రమే వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రదీప్, ఎంపిడిఒ హరినారాయణ, ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం సోంపల్లిలోని చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి తడి, పొడి చెత్తగా విభజించే పనులు ముమ్మరంగా జరగాలన్నారు.

రైతుల ఆందోళన ప్రభుత్వానికి పట్టదా?

- కలెక్టరేట్ వద్ద నిరసనలో వైసిపి నాయకులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రైతు సంక్షేమాన్ని విస్మరించి, అన్నదాతను దగా చేస్తున్న కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా నిరసిస్తూ వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో అన్నదాత పోరుబాట నిర్వహించారు. కర్షకులు, వైఎస్ఆర్ సిపి కార్యకర్తలు, నాయకులు కదం తొక్కారు. కలెక్టరేట్ గేట్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రైతులు ర్యాలీ చేపట్టారు. రైతులకు పెట్టుబడి సాయాన్ని కేంద్రంతో సంబంధం లేకుండా సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు చెప్పారని, మొదటి ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఎగరగొట్టి, రెండక ఏడాదిలో ఒక కంతుగా ఇచ్చారని చెప్పారు. ఇప్పటి వరకు బకాయి పడ్డ రూ.33 వేలను ఏకకాలంలో చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమాలను అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తోతాపురి మామిడి రైతులకు పరిహారం అందించాలని కోరారు. గండికోట-కాలేటి వాగు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలన్నారు. రైతు సమస్యలపై కలెక్టరేట్‌లో డిఆర్ఒకు రైతులతో కలసి వైసిపి నేతలు వినతిపత్రం సమర్పించారు కూటమి ప్రభుత్వానికి అన్నదాతల ఆక్రందన కనపడలేదా అని వైసిపి నాయకులు ప్రశించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పరిశీలకులు సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రా రెడ్డి, మదనపల్లె ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దేవనాథరెడ్డి, డిఎంఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మదనపల్లె మున్సిపల్ చైర్మన్ మనూజ, వైసిపి నాయకులు రైతులు పాల్గొన్నారు.

బైండోవర్ కేసు ఉపసంహరించుకోవాలి : సిపిఎం



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బొప్పాయి రైతుల గిట్టుబాటు ధర కోసం అండగా నిలబడిన సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్‌పై బైండోవర్ కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ల మణి డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకొని రైల్వేకోడూరు, రాజంపేట బొప్పాయి రైతులకు న్యాయం చేయాలని తెలిపారు. కలెక్టర్ నిర్ణయించిన రూ.9ల ధరను అమలు చేయని, రైతులను మోసం చేసే దళారులపై ఢిల్లీ వ్యాపారస్తులపై 420 కేసు నమోదు చేయాలన్నారు. నెల రోజులుగా రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న చంద్రశేఖర్‌పై పోలీసులు బైండోవర్ కేసు పెట్టి తహశీల్దార్ ముందు బైండోవర్ చేశారన్నారు. పోలీసుల దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బొప్పాయి రైతులకు న్యాయం చేయాలని, వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరడమే చంద్రశేఖర్ చేసిన నేరంగా పోలీసులు భావిస్తున్నారా అని ప్రశ్నించారు.

రైల్వేకోడూరు: చంద్రశేఖర్‌పై నమోదు చేసిన బైండోవర్ కేసు ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లతీఫ్ అన్నారు.రైతుల పండించిన బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసిన పోలీసుల తీరును ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మదన్ సాయి, గోరువర్ధన్ పాల్గొన్నారు. బొప్పాయి రైతుల గిట్టుబాటు ధర కోసం అండగా నిలబడిన సిఐటియు చంద్రశేఖర్‌పై బైండోవర్ కేసు తక్షణమే ఉపసంహరించుకోవాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీలక్ష్మి, కోడూరు ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు వనజ కుమారి, అధ్యక్షులు ఎన్.శ్రీరమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకుమారి, కోశాధికారి జి.పద్మ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రోప్ స్కిప్పింగ్‌లో 'చైతన్య' విద్యార్థి సత్తా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని శ్రీ సాయి చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఎ.వి.ప్రేమ్ తేజ ఆచారి రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో సత్తా చాటాడు. మంగళవారం విద్యార్థిని కళాశాల చైర్మన్ డాక్టర్ నిర్మల్ కుమార్‌రెడ్డి, సిఇఒ ఎం.రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ధనుంజయరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నరసింహులు, అడ్మిన్ ఆఫీసర్ ఆనందరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్, సిఇఒ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం శుభపరిణామమన్నారు. మూడు విభాగాలలో బంగారు పతకాలను సాధించడం కళాశాలకే గర్వకారణమన్నారు. మా కళాశాలలో విద్యార్థులకు అత్యుత్తమ బోధనతోపాటు క్రీడలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రేమ్‌తేజ రోప్ స్కిప్పింగ్ పోటీలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పథకాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకుని మరింతమంది విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థి ప్రేమ్ తేజ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ (ఐఆర్ఎస్ఎఫ్) మాస్టర్ ఈవెంట్‌లో స్పీడ్ స్ప్రింట్, డబుల్ అండర్ విభాగాలలో, టీం ఈవెంట్‌లో స్పీడ్ డబుల్ రిలే విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పథకాలను సాధించినట్లు తెలిపారు. అక్టోబర్ 23 నుండి 25వ తేదీ వరకు ముంబయిలో జరిగే జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో రాణించి బంగారు పతకాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. రోప్ స్కిప్పింగ్ పోటీల్లో తనను అన్నివిధాల ప్రోత్సహించిన కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలదే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తల్లిదండ్రులు వృద్ధాప్యంలోకి వెళ్లిన సమయంలో వారిని పోషించాల్సిన బాధ్యత పిల్లలదేనని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మునిగోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని చైతన్యసంస్థలో ఆనంద వృద్ధాశ్రమాన్ని జిల్లా ఉపాధ్యక్షులు జగన్మోహన్‌తో కలిసి ఆయన సందర్శించారు. 80 ఏళ్ల వయో వృద్ధుడైన లక్ష్మీ నరసప్పకు రుక్మాంగధరావ్, నాగభూషణం, వేణు అనే ముగ్గురు కుమారులు ఉండగా ఆయన భార్య కూతురు, అల్లుడు చనిపోయారు. ఆయన స్వార్జితం 7.5 ఎకరాల పొలాన్ని ముగ్గరు కుమారులకు సమానంగా పంచి పెట్టారు. బిడ్డలు ఆయన బాధ్యతలు విస్మరించడంతో లక్ష్మీ నరసప్ప ఒంటరిగా ఆనంద వృద్ధాశ్రమంలో వున్నాడు. పిల్లలు తన బాగోగులు చూడడం లేదని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషనుకు ఫిర్యాదు చేశారు. ఈ పిర్యాదుపైన స్పందించిన ఎన్.మునిగోపాల కృష్ణ ఆనంద వృద్ధాశ్రమానికి చేరుకొని చైతన్య సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎంపీ ఆనందన్, జనరల్ సెక్రటరీ కవిత రాణి తోపాటు లక్ష్మీ నరసప్పతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వయో వృద్ధుడికి భోజనవసతి ఆశ్రయం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. వృద్ధుడు నరసప్పకు వయో వృద్ధుల సంరక్షణ చట్టం గురించి వివరించి సలహాలు, సూచనలు అందించడంతో పాటు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.



లక్ష్మీ నరసప్పను పరామర్శిస్తున్న మునిగోపాలకృష్ణ

సాంకేతిక విద్యపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఎంబిఎ తొలి సంవత్సరం విద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ది ఫ్యూచర్ ఆఫ్ బిజినెస్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించామని వైస్ ఛాన్సలర్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి కేంద్రంగా ఉన్న డేటా కోట్స్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, సిఇఒ బి.హర్షద్ బాషా హాజరై మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మేనేజ్‌మెంట్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వ్యాపార ధోరణులపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చెయిన్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, 5జి వంటి సాంకేతిక పురోగతులు పరిశ్రమల పనితీరును మార్చేశాయని తెలిపారు. ఆటోమేషన్, ఎఐ వినియోగం ద్వారా మానవ తప్పిదాలు తగ్గి నిర్ణయాలు వేగవంతం అవుతున్నాయని చెప్పారు. బిగ్ డేటా విశ్లేషణలు వ్యాపారాలకు వినియోగదారుల ప్రవర్తన అంచనా వేసే శక్తినిస్తాయని వివరించారు. డిజిటల్ పరివర్తనను స్వీకరించే కంపెనీలు కార్యకలాపాలను మెరుగుపరచడమే కాకుండా కొత్త వ్యాపార పర్యావరణ వ్యవస్థలను సృష్టిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ భాను శ్రీ రెడ్డి, డాక్టర్ గీత దేవి పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి- రాయచోటి

అనంతపురంలో బుధవారం నిర్వహించబోయే సూపర్ సిక్స్.. సూపర్ హిట్ బహిరంగ సభను విజయవంతం చేదామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి అన్ని సంక్షేమ పథకాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందజేస్తూ ముందుకు వెళ్తున్న నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో నిర్వహించే సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని పిలుపునిచ్చారు. జిల్లాలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు ప్రతి ఒక్కరూ పాల్గొన్నాలన్నారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాగార్జున రెడ్డి, శివ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి-రాయచోటి

నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా ఉంటుందని టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లె లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణ కుల వృత్తి వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించిన కూటమి ప్రభుత్వానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ పట్టణం లోని స్థానిక మంగళ కాలనీ లో నాయీ బ్రాహ్మణ సంఘాలు అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో నాయీ బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం ద్వారా మరిన్ని సేవలు, తోడ్పాటు అందించే విధంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటారని చెప్పారు.నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం తరపున మరింత లబ్ధి చేకూరే విధంగా బాధ్యత తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమలకు ఖాదరవల్లి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

స్నేహబంధాల ఆరంభానికి ఫ్రెషర్స్ డే : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

స్నేహబంధాల ఆరంభానికి, విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ప్రెషర్స్ డే వేడుకలు తోడ్పడతాయని జిల్లా విద్యాశాఖాధికారి, డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో మంగళవారం కొత్త విద్యార్థులకు సాదర స్వాగతం పలికే ఫ్రెషర్స్‌డే వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో రెండవ సంవత్సరం విద్యార్థులు కొత్తగా చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులను పేరుపేరునా పలకరిస్తూ సాదర స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ డిఇఒ మాట్లాడుతూ డైట్ విద్యాలయం ఛాత్రోపాధ్యాయులకు దేవాలయమని, ఇక్కడే భవిష్యత్తు ఉపాధ్యాయుల స్ఫూర్తి ఆవిష్కృతమవుతుందని తెలిపారు. ఇక్కడి శిక్షణ పొందిన వేలాది మంది ఉపాధ్యాయులుగా రాణిస్తూ ఎందరో విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే కొత్త విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా కళాశాల వాతావరణానికి అలవాటు పడేలా చేస్తుందన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు డిఇఒ బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో నాటకాలు, మిమిక్రీ, దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలతో విద్యార్థులు కళాత్మక ప్రతిభను ప్రదర్శించి అందరిని అలరించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైద్య విద్యను ప్రయివేటీకరించొద్దు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల పబ్లిక్ ప్రయివేట్ పార్నర్‌షిప్ మోడల్ ద్వారా నిర్వహించాలనే నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో బిఎస్‌పి కార్యాలయం అయన విలేకరుల మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వమే, వైద్య విద్యను ప్రయివేట్ వ్యాపార వర్గాల చేతికి అప్పగించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య విద్య అందించాలంటే అది ప్రభుత్వ భాధ్యత అని చెప్పారు. ప్రయివేట్ భాగస్వామ్యాన్ని తీసుకురావడం వల్ల, వైద్య విద్య పూర్తిగా లాభాపేక్షల వ్యాపారంగా మారుతుందని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అవకాశాలు తగ్గిపోతున్నాయని చెప్పారు. ఫీజులు పెరగడం వల్ల సామాన్య విద్యార్థులకు డాక్టర్ అవ్వడం కష్టతరం అవుతుందని, మెడికల్ సేవలు కూడా వ్యాపార ధోరణిలోకి వెళ్లి, ప్రజా ఆరోగ్య రంగం మరింత దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి ఎర్రంగాళ్ళ వెంకటరమణ, రాయచోటి అసెంబ్లీ అధ్యక్షులు అబ్బవరం నాగేశ్వర్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలను ప్రయివేటీకరణ చేస్తూ ఇచ్చిన ప్రజావ్యతిరేక జీవోను వెంటనే రద్దు చేయాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత పార్లమెంటులో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ , వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించి జీవోకు వ్యతిరేకంగా పోరాడాలని తెలిపారు. ఎన్‌డిఎ కూటమి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు వైద్య విద్యను, వైద్య సేవలను దూరం చేసే దుర్మార్గపు చర్యలను చట్టసభల్లో ఎండగట్టాలని తెలిపారు.

సిఎం పర్యటనకు బస్సులు.. ప్రయాణికులకు ఇక్కట్లు



బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణీకులు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల సందడి నెలకొంది. ఈనెల 10న అనంతపురంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "సూపర్ సిక్స్ సూపర్ హిట్" సభ నిర్వహించనుండడంతో ఆ సభకు జన సమీకరణ కోసం మంగళవారమే అన్నమయ్య జిల్లా నుంచి 475 ఆర్టీసీ, అద్దె బస్సులను తరలించారు. ఫలితంగా ముందస్తు సమాచారంలేని ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్లలో బస్సుల రాక కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఉన్న బస్సులు కూడా సమయానికి రాక, ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టు బస్సులులేక, బస్టాండుకు చేరే బస్సులన్నీ ప్రారంభం నుంచే జనంతో నిండి వస్తుండడంతో మధ్యలో బస్సులు ఎక్కే ప్రయాణికులు నానాతంటాలు పడాల్సివచ్చింది. ముఖ్యంగా తిరుపతి వైపు వెళ్లే బస్సుల్లో నేరుగా వెళ్లే ప్రయాణికులకు మాత్రమే అవకాశం దక్కుతుండడంతో, మార్గం మధ్యలో ఎక్కి, దిగాల్సిన ప్రయాణికుల దుస్థితి అంతా ఇంతా కాదు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల స్థితి కూడా చాలా దయనీయంగా మారింది. మంగళవారం పీలేరు వారపు సంత కూడా కావడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో పాటు, స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రయాణం చేసే మహిళల సంఖ్య కూడా బాగా పెరిగిపోయింది. పీలేరు ఆర్టీసీ బస్టాండు ప్రయాణికులతో నిండుకుంది. ముఖ్యంగా పీలేరు నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులే అధికంగా ఉండడం గమనార్హం. పీలేరు డిపో సర్వీసులతోపాటు, అటు మదనపల్లి రెండు డిపోలు, ఇటు రాయచోటి, చిత్తూరు, తిరుపతి ఆర్టీసీ డిపో నుంచి వచ్చే బస్సులు కూడా స్టార్టింగ్ పాయింట్ నుంచే నిండుగా ప్రయాణికులతో వస్తుండడంతో పీలేరు, పరిసర ప్రాంతాల నుంచి వేర్వేరు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు తగినన్ని ఆర్టీసీ బస్సులులేక పోవడంతో సమయానికి ప్రయాణం చేయలేక బస్టాండుల్లోనే జనం గంటలకు గంటలు నిరీక్షించక తప్పలేదు. పీలేరు ఆర్టీసీ డిపోలో మొత్తం 105 బస్సులు ఉండగా వాటిలో 58 పల్లె వెలుగు బస్సులు, 26 అద్దె పల్లె వెలుగు బస్సులు, 11 ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, 5 అద్దె ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, మొత్తం 100 బస్సులు అనంతపురంకు తరలినట్లు తెలిసింది. అలాగే మదనపల్లి 1 డిపో నుంచి 120 బస్సులు, మదనపల్లి 2 డిపో నుంచి 76 బస్సులు, రాయచోటి డిపో నుంచి 100, రాజంపేట ఆర్టీసీ డిపో నుంచి 79 బస్సులు పంపినట్లు తెలుస్తోంది.



పోటీపడి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం : 'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని ప్రతి ప్రతి కార్యకర్తకూ అండగా ఉండి ఏ సమస్య వచ్చినా కూటమి ప్రభుత్వం ముందుంటుందని టిడిపి రాజంపేట ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం టిడిపి మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టిడిపి అభిమానులు కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముందుగా దిగువ అబ్బవరం ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సర్పంచ్ నాగార్జున ఆచారి ఆధ్వర్యంలో మట్లి పంచాయతీలో చమర్తికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీలో తిరిగి వీరబల్లిలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రం అభివృద్ధిపథంలో దూసుకెళుతుందని పేర్కొన్నారు. రాజంపేట నియోజకవర్గం కీలకమని స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జెండా చరిత్రలో నిలిచిపోయేలా గెలవాలన్నారు. ప్రభుత్వ అధికారులు, నాయకులు ప్రజలకు చేరవలసిన పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి సామాన్యుడు టిడిపిలో నాయకునిగా ఎదగవచ్చన్నారు. నేను సామాన్య కార్యకర్త నుంచే టిడిపిలో ఈ స్థాయికి వచ్చా నన్నారు. కష్టపడి పార్టీకి పనిచేస్తే పార్టీ మనలను గమనించి మనకు పదవులు ఇస్తుంద న్నారు. ఎన్నో అవమానాలు పడ్డానని, సోషల్ మీడియాతో అవమానపరిచారని, నా కష్టాన్ని పార్టీ గుర్తించిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి భరత్‌కమల్

13న లోక్ అదాలత్ : జడ్జి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఈనెల 13వ తేదీన జాతీయ లోకాదళత్ నిర్వహిస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి భరత్‌కమల్ తెలిపారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాలకు చెందిన పోలీస్ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఆయన మాట్లాడుతూ జాతీయ లోకదా లత్ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేంపల్లె షరీఫ్‌కు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెకు చెందిన కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పుర స్కార గ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్‌కు ఈ ఏడాది కథానిక విభాగంలో తెలుగు యూని వర్సిటీ కీర్తి పురస్కారం ప్రకటించింది. ఇటీవలే ఆయన 'చారల పిల్లి' పేరుతో తన మూడవ కథా సంకలనాన్ని వెలువరించారు. అంతకుమునుపు ఆయన రాసిన 'జుమ్మా', 'టోపీ జబ్బార్' తరహాలోనే 'చారలపిల్లి' కథా సంకలనం కూడా పాఠకుల ఆదరణ పొందింది. షరీఫ్ రాసిన కథలు వివిధ భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. కొన్ని నాటకంగా ప్రదర్శితమయ్యాయి. మరికొన్ని ప్రతిష్టాత్మక జాతీయ కథా సంకలనాల్లో చోటు సంపాదించాయి. ఆయన రాసిన 'ఆకుపచ్చముగ్గు' కథ డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపికైంది. జర్నలిజంలో పిహెచ్‌డి చేసి ఆయన వెలువరించిన పరిశోధన పుస్తకం 'టీవీ ప్రకటనలు' వివిధ యూనివర్సిటీల్లో ఎంబిఎ విద్యార్థులకు రిఫరెన్స్ పుస్తకం కింద ఉంది. షరీఫ్ కథా సాహిత్యం మీద పలు యూనివర్సిటీల్లో పిహెచ్‌డి, ఎంఫిల్ పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో షరీఫ్ గత పాతికేళ్లుగా కథానికా విభాగంలో విశేష కృషి చేసినందుకు తెలుగు యూనివర్సిటీ ఈ పురస్కారం ప్రకటించింది. ఈనెల 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రచయితకు రూ.5,116 నగదుతోపాటు పురస్కార ప్రదానం చేస్తున్నట్లు యూనివర్సిటీ విసి నిత్యానందరావు ఒక ప్రకటనలో తెలిపారు.

గర్భస్రావాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

గర్భస్రావాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ వి.మల్లేష్ సూచించారు. మైదుకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం బద్వేలు డివిజన్ పరిధిలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి మల్లేష్ ఆధ్వర్యంలో గత నెలలో జరిగిన పిసిపి ఎన్‌డిటి అబార్షన్లపై ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్రావాల విషయంలో సరైన నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రికార్డుల నిర్వహణ, అబార్షన్ల ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ వి.సుధా, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్వైజర్లు కె.వీరాంజనేయులు, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు గ్రామపంచాయతీ కార్మికులకు అందాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య, పంచాయితీ అధ్యక్షులు బి.రమణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 మే, జూన్ మాసాలకు సంబంధించి 46 మంది పారిశుధ్య కార్మికుల దగ్గర వెట్టి చాకిరీ చేయించుకున్న అప్పటి పంచాయతీ కార్యదర్శి వేతనాలు ఎగ్గొట్టారని ఆరోపించారు. సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాష పంచాయతీ పాలకమండలి సభ్యుల ఆమోదంతో పెంచిన జీతం రూ.3వేలులో కూడా నాటి కార్యదర్శి రూ.1000 తగ్గించి చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. 46 మంది కార్మికులకు సుమారు రూ.11 లక్షల మేరకు వేతన బకాయిలు ఉన్నాయని, వీటిని వెంటనే చెల్లించేందుకు జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలంటూ వినతి పత్రాలను జిల్లా కలెక్టరుకు, జిల్లా పంచాయతీ అధికారికి, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రికి, రాష్ట్ర విద్యా శాఖ మంత్రికి, స్థానిక ఎమ్మెల్యేకి పంపారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు పులి రెడ్డెప్ప, నాగార్జున, రమణ, ఓబులయ్య, సుబ్రమణ్యం, శాంతకుమారి, రాజేశ్వరి, చిట్టెమ్మ, రాధారాణి పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

నానో యూరియాపై మొగ్గు చూపాలి : ఎఒ



నిమ్మనపల్లి : నానో యూరియా పిచికారి విధానాన్ని చేసి చూపిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నానో యూరియాతో వ్యవసాయ రంగంలో సత్ఫలితాలను సాధించవచ్చని, రైతులు నానో యూరియాపై మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారి మంజుల అన్నారు. మంగళవారం మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్, ఎంపిడిఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, సర్పంచు సుబ్రమణ్యం, రెవెన్యూ అధికారులతో కలిసి రాచవేటివారిపల్లె, బండ్లపై గ్రామాలలో రైతులకు నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. సచివాలయంలో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. నానో యూరియా వినియోగం పద్ధతులను, పిచికారి విధానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు కోరమండల్ ఎరువుల సంస్థ ప్రతినిధుల సహకారంతో స్వయంగా చూపిస్తున్నామని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను గుర్తించి రైతులు కూడా అందుకు తగ్గట్టుగా వ్యవసాయ పద్ధతులను మార్చుకోవాలని వివరించారు. ఆధునిక పద్ధతులకు రైతులు అలవాటు పడాలన్నారు. ఏ పంటకైనా మోతాదుకు మించి ఎరువులను వాడకూడదని, యూరియాను కేవలం పంట ఎదుగుదలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. అధికంగా యూరియాను ఉపయోగించడం వలన పంట పెరుగుతుందే తప్ప దిగుబడి ఆశించినట్లు ఉండదన్నారు. పంట దిగుబడులను సాధించాలంటే ప్రత్యామ్నాయ ఎరువులను, పద్ధతులను ఉపయోగించాలన్నారు. ప్రస్తుతం గుళికల యూరియాకు ధీటుగా ద్రవ రూపంలోని నానో యూరియాను ఉపయోగించవచ్చని ఇది ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. నానో యూరియా అర్ధ లీటర్ బాటిల్ కేవలం రూ.265లు మాత్రమేనని, దీనిని ఒక ఎకరా పొలానికి ఉపయోగిం చవచ్చన్నారు. డ్రోన్ల సహాయంతో, స్ప్రేయింగ్ మిషన్లతో పంటపై పిచికారి చేసుకోవచ్చన్నారు. బండ్లపై గ్రామంలోని రైతులకు నానో యూరియా పిచికారి విధానాన్ని అధికారులు స్వయంగా చూపించారు. క్రమంగా ప్రజలు గుళికల యూరియాతో పాటు నానో యూరియా పై మొగ్గు చూపాలని తెలియజేశారు. కార్యక్రమంలో కోరమండల్ ఎరువుల సంస్థ ప్రతినిధి పాల్గుణ, విఆర్ఒ హేమాంబర్ రెడ్డి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామాపురం : యూరియా వాడకంపై అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ శాఖలో సహాయ సంచాలకులు జయరాణి పేర్కొన్నారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లె సచివాలయ పరిధిలో రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవ సంబంధమైన ఎరువుల వాడకం వల్ల అధిక దిగుబడులు పొందడంతో పాటు భూమి సారవంతంగా ఉంటుందన్నారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం అలవర్చుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధి కారి నాగమణి మాట్లా డుతూ బస్తా యూరియా వాడకం బదులు నానో ఏరియా తయారు చేసుకోవడం ఉపయోగం గురించి వివరించారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ జాషువా మాట్లాడుతూ మండలంలో ఎక్కడ యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో రైతు సేవకేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు. **కలికిరి:** కలికిరి మండలం మరికుంటపల్లి రైతు సేవా కేంద్రంలో నానో ఎరువులు, జీవన ఎరువులపై అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఎం.హేమలత నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలికిరి తహశీల్దార్ డి.హరికుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యూరియాను అవసరమైనంత వరకు మాత్రమే పంటకు వినియోగిం చాలని, అలాగే మార్కెట్లో అందుబాటులో ఉన్న నానో యూరియా నానో డిపిఎలను వాడుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సర్పంచ్ రెడ్డిరామ్, ఎఇఒ ఇంద్ర, విఆర్ఒ, ఆర్ఎస్‌కె సిబ్బంది రైతులు పాల్గొన్నారు. **కలకడ:** సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ భాను ప్రసాద్ తెలిపారు మండలంలోని ఏనుగొండ పాలెం పంచాయితీ దిగుపాలెంలోని రైతులకు సేంద్రియ ఎరువులు వాడకం ఆ ఎరువుల వల్ల ఉండే ఉపయోగాలు గురించి రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** రైతులకు నానో, జీవన ఎరువుల వినియోగంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సుమద్దిరేవుల బి ఎర్రగుడి కోనంపేట అనంతపురం ఈడిగపల్లి గ్రామాలలో రెవెన్యూ వ్యవసాయ ఎంపిడిఒ ఆయా గ్రామ సచివాలయం యూరియా పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ క్రాంతికుమార్, ఎఒ రాజాకుమారి, ఎంపిడిఒ రెడ్డయ్య యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా ఎకరానికి 1.5 మూట మాత్రమే వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు తుమ్మలచంద్రమ్మ, లక్ష్మీనారాయణ, హార్టికల్చర్ అధికారి మల్లికార్జున, నాయకులు బాబుల్‌రెడ్డి, రాధాకృష్ణ, ఆంజనేయులు, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు టిబి పరీక్షలు తప్పనిసరి



టిబి పరీక్షలకు రక్త నమూనాను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-కలికిరి

క్షయ వ్యాధికి మందులు తింటూ చికిత్సలో ఉన్న రోగులతో కలిసి నివసిస్తున్న కుటుం బ సభ్యులు, సన్నిహితులు ముందస్తున్న టిబి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ కావ్య గంధ, మరియు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి పేర్కొన్నారు. షుగర్ వ్యాధి ఉన్న వారు, ధూమపానం, మద్యం సేవించే వారు, కేన్సర్, డయాలసిస్, ఎత్తుకు తగ్గ బరువు లేనివారు, దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న మంచానికే పరిమిమైన వారు తప్పనిసరిగా సివైటిబి పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో టిబి టెస్టింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ప్రస్తుతం టిబికి చికిత్స తీసుకుంటున్న రోగుల కుటుంబ సభ్యులు 18సంవత్సరాల పై బడిన వారికి సైటిబి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం 0.1 మి.లీ మందును ముంజెతి భాగంలో చర్మం పొరలలో ఇవ్వడం జరుగుతుందని 48గం అనంతరం పరీక్ష చేసిన ప్రదేశం లో 48-72 గంటల తరువాత నిర్దిష్ట పరిమాణం కంటే ఎర్రటి బోడిపే ఏర్ప డితే టిబి వ్యాధి సంక్రమణగా నిర్ధారణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరికైతే పాజిటివ్ ఫలితం వస్తుందో వారికి భవిష్యత్‌లో టిబి తప్పనిసరిగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. అటువంటి వారు టిబి బారిన పడకుండా పరీక్షలు నిర్వహించి మూడు నెలల పాటు మందులు ఇవ్వ డం జరుగుతుందని తెలిపారు. మొత్తం 80 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకుని భవిష్యత్‌లో టిబి బారిన పడకుండా ముందస్తు చికిత్స పొందవచ్చును అన్నారు. సై. టీబీ పరీక్షలు అన్ని సచివాలయం లలో ఉన్న ఎఎన్ఎంల దగ్గర ఎప్పుడైనా ఉచితంగా చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు సుధాకర్ ఎంఎల్‌హెచ్‌పిలు సాహీన, కృష్ణకుమారి, నాగరాణి, చందుప్రియ, గీత, పావని ఆశాకార్యకర్తలు, సిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం : సిడిపిఒ

ప్రజాశక్తి-రామాపరం


బాలికలకు ప్రభుత్వాలు కల్పిస్తున్న చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలి లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ సిడిపిఒ జహరాభీ పేర్కొన్నారు. మండలంలోని కస్తూర్బా బాలికల పాఠ శాలలో మంగళవారం కిశోర బాలికలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర నెలసరి వచ్చే సమస్యల వల్ల రక్తం హీనత సమస్య రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలికల రక్షణ కోసం పోక్సో చట్టాల గురించి వివరించారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై కఠినమైన చట్టాలు ఉన్నాయని, కిశోర బాలికలు తెలుసుకోవాలన్నారు. గ్రామాలలో నేటికి బాల్య వివాహాలు జరుగు తున్నాయని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహల చట్ట గురించి వివరించి చెప్పారు. చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాలికలు బాగా చదువుకొని ఉన్నతమైన స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుతాలు ఈ సమావేశంలో



కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ జహరాభీ

కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభావతి ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుజాత అరుణకుమారి అంగన్వాడి కార్యకర్తలు కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు



కలికిరి : ఎంపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇక్బాల్‌అహ్మద్

ప్రజాశక్తి-కలికిరి

లిక్కర్ స్కాం కేసులో అరెస్టయి మధ్యంతర బెయిల్ పొందిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని ముస్లిం మైనారిటీ రాష్ట్ర మాజీ చైర్మన్ ఇక్బాల్‌అహ్మద్, వైసిపి సీనియర్ నాయకులు రత్నశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మిథున్ రెడ్డిని కలిసి ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మనపై పెట్టే తప్పుడు కేసులుపై నాయకులు కార్యకర్తలు అధైర్య పడవద్దని చెప్పారని పేర్కొన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారని తెలిపారు. **బి.కొత్తకోట :** ఎంపీ మిథున్‌రెడ్డిని మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్‌అహ్మద్, సాయిలు డిల్లీలో మర్యా దపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ ఎంపీ మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా పలకరించారన్నారు.ప్రస్తుత రాజకీయాలలో పెద్దిరెడ్డి కుటుంబానికి అత్యంత ప్రజాదరణ ఉందన్నారు.ఎంపీకి తాత్కాలిక బెయిల్ మంజూరు కావడంతో ఆయనను కలవడానికి పెద్ద ఎత్తున నాయకులు ,కార్యకర్తలు తరలివస్తు న్నారన్నారు. మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల ఓటింగులో ఆయన పాల్గొన్నారు. నమ్ముకున్న వారికి పెద్దిరెడ్డి కుటుంబం అన్నివేళలా అండగా ఉంటుందన్నారు. ఎంపీకి త్వరలోనే పూర్తిస్థాయి బెయిల్ మంజూరు కావాలని ఆకాంక్షించారు.



ఎంపీ మిథున్‌రెడ్డితో పాగొండ ఖలీల్ అహ్మద్

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత



యూరియా కొరత తీర్చాలంటూ నిరసన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- కలకడ

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత ఏర్పడిందని పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బాలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం యూరియా కొరత తీర్చాలంటూ కాంగ్రెస్ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో యూరియా అందక రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కొరతతో పాటు వ్యవసాయానికి కావలసిన ఇతర అవసరాలు అందక రైతులు ఎలా కష్టపడుతున్నారో తెలుసుకుని, రైతుల పక్షాన నిలబడి కలకడ మండలం ఎర్రయ్యగారిపల్లె నుంచి బస్‌స్టాండ్ వరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతులు అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసి వ్యవసాయం చేయాల్సి వస్తోందన్నారు. పంట చేతికి వచ్చిన తర్వాత సరైన గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎంతో అనుభవం ఉన్న విజనరీ నాయకుడు అని చెప్పుకునే చంద్రబాబు ముందుగానే ఎందుకు యూరియా కోరతను గుర్తించలేక పోయారని ప్రశ్నించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా గురించి ఎందుకు పార్లమెంట్ మాట్లాడలేక పోతున్నారు. రైతు చెడు పోవడానికి కావలసిన మద్యం మాత్రం కొరత ఏర్పడలేదు. రైతు బాగుపడేందుకు కావాల్సిన యూరియాకు మాత్రం కొరత ఏర్పడిం దన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతులు ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. కార్యక్రమంలో కలకడ మండల అధ్యక్షురాలు టి.మల్లిక, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్య క్షుడు ఎస్‌కె.బాషా, మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షుడు హిదయ్‌తుల్లా హుసేనీ, గుర్రకోండ కాంగ్రెస్‌పార్టీ నాయకులు సమీర్, మస్తాన్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆదినారాయణ, ఖాజా, తిరుమలేష్, మహేష్,గిరి, సునిల్,హరీష్, వినయ్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రం చిన్నమండెంలో భారత రాజ్యాంగ నిర్మాణ బిఆర్. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ నాయకులు మంగళవారం తహశీల్దార్ నరసింహులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రధాన కూడళ్లలో అంబేద్కర్ విగ్రహం లేదని విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని తహశీల్దార్‌ను కోరినట్లుతెలిపారు. తహశీల్దార్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంఆర్ పిఎస్ నాయకులు పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న శ్రీనివాసులు

గర్భిణులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - నందలూరు

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుండి చికిత్స నిమిత్తం విచ్చేసిన గర్భిణులకు రాయల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆసంస్థ అధ్యక్షులు గంగనపల్లి శ్రీనివాసులు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముందుగా గర్భిణీలకు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ మస్తానమ్మ వైద్య పరీక్షలు చేసి,తగు జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌కమల్ మాట్లాడుతూ రాయల్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు గంధం గంగాధర్, పునగాని. రాము యాదవ్, కలిశెట్టి భరత్, చంద్ర, లక్ష్మీకర్, శివ పాల్గొన్నారు.



ఎస్‌జిఎఫ్ గేమ్స్ నిర్వహణపై మాట్లాడుతున్న హెచ్‌ఎం భువనేశ్వరి

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని బాలుర పాఠశాలలో ఈనెల 11, 12 తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పోటీలకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కస్తూరిబా విద్యాలయం, ఎపి మోడల్ స్కూల్, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు అండర్-14, అండర్-17 కేటగిరిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు జరుగుతాయన్నారు. 15 తేదీన అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించబడునన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంఇఒ భీమేశ్వ రాచారి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ మండల సెక్రటరీ తాజ్‌బాషా, రాజేశ్వరి పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు సేవ మహాభాగ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

అనాథలు, అనాథ వృద్ధులకు సేవ చేయడం మహాభాగ్యమని, అన్నదానం మహాదానమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి తెలిపారు. స్థానక ప్రముఖ సంఘ సేవకుడు తోపురెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి మనవరాలు నిధిషా పుట్టినరోజు సందర్భంగా మంగళవారం స్థానిక నాగమ్మనగర్ కాలనీలోని మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధులు, అనాథ పిల్లల ఆశ్రమంలో అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా తులసిరెడ్డి మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అని కొనియాడారు. కార్యక్రమంలో రవీంద్రనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు సుజాత, పవన్‌కుమార్ రెడ్డి, లక్ష్మీదేవి, ప్రసాద్‌రెడ్డి, దేవి ప్రియాంక, నిత్యశ్రీ, దీపికా, శిరీషా, సతీష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారులు సిండికేట్ అయితే చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల వ్యవసాయశాఖ మార్కెట్‌లో బత్తాయి పండ్లకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, వ్యాపారులు సిండికేట్ అయి వ్యాపారం చేస్తే సహించేదిలేదని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి రైతులకు హామీ ఇచ్చారు. ఆ మేరకు మంగళవారం ఆయన మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, మార్కెట్ యార్డ్ సిబ్బందితో కలిసి పరి శీలించారు. రెండు రోజులుగా పులివెందులలో చీనీ కాయల వ్యాపారస్తులు 12 మంది సిండికేట్‌గా ఏర్పడి టన్ను బయట ప్రాంతంలో రూ.20,000 ధర పలుకుతుండగా, పులివెందులలో రూ.9వేల నుంచి రూ.12 వేలకే కాయ లను కొనుగోలు చేసి వ్యాపారులు ఇతర ప్రాంతాలకు టన్ను కాయలకు రూ.20వేల నుండి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నారని రైతులు సోమ వారం ఆందోళన చేశారని ఆయన పేర్కొన్నారు. బయట ప్రాంతాల నుండి వచ్చే వ్యాపారుల అందరికీ మార్కెట్ యార్డ్‌లో రూంలు ఇస్తామన్నారు. చిన్నకుప్ప, పెద్దకుప్ప అనే తేడా ఏమీ ఉండదు.. రైతులు ఆ అపోహ పెట్టుకో వద్దన్నారు. గ్రేడింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. పులివెందుల మార్కెట్‌ను తెచ్చింది వైసి పినే.. అయినా కూడా తాము దానిని కంటిన్యూ చేస్తున్నామని, రైతులు ఆం దోళన చెందాల్సిన అవసరం లేదని బీటెక్ రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి, సింహాద్రి పురం మాజీ జడ్పీటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పులివెందుల, సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్లు రామసుబ్బారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ 'బాలాజీ'దే అగ్రస్థానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా బాలాజీ హైస్కూల్‌దే అగ్రస్థానమని ఆ పాఠశాల డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. సోచ్ ఫౌండేషన్‌కు బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ విద్యార్థుల సహకారంతో మంగళవారం రూ.1,40,102 నగదు వితరణ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ సోచ్ ఫౌండేషన్‌లోని విభిన్నప్రతిభావంతుల్లో ఉన్న ప్రతిభను చూపించి తర్వాత వారికి సహకారం చేయమని అడగడం అభినందించదగ్గ విషయమన్నారు. అంగవైకల్యాన్ని సైతం ఎదిరించి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా వారి సందేశం, వారి గీతాలాపన ఉందన్నారు. ఇలాంటి వారికి తమ పాఠశాల ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గతంలో రాగసుధా ఫౌండేషన్ వారికి రూ.1,15,000 వరకు ఇచ్చామన్నారు. జమ్మలమడుగు పట్టణంలోని మే ఐ హెల్ప్ ఫౌండేషన్‌కు మా వంతు సహకారం అందిస్తూనే ఉన్నామన్నారు. ఎక్కువ నగదు కలెక్ట్ చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెమెంటో, మెడల్ ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో హైస్కూల్ పరిపాలన అధికారి కెవివి ప్రసాద్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు ఖాసిం, రిషికేశవాచారి, సత్యా నందం, వెంకటప్రసాద్, మహబూబ్ బాషా, అబ్దుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.